సాక్షి
జనగామ
శుక్రవారం । 6 । జనవరి । 2023

క్షేమంగా గమ్యం ఎలా..?
సొంత డ్రైవింగ్‌తో అధిక ప్రమాదాలు

మినీ మేడారం పనులు పూర్తి చేయాలి

పాటలే ప్రజా ఉద్యమాలకు ఊతం

కాకతీయ గ్రామీణ కళామేళా ప్రారంభం - 10లో▸



'పిల్లల' గుర్తింపునకు సర్వే
బడి బయట ఉన్న పిల్లల గుర్తింపునకు శుక్రవారం నుంచి ఈనెల 18 వరకు సర్వే నిర్వహించాలని పాఠశాల విద్యా డైరెక్టర్ దేవసేన ఆదేశాలు జారీ చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$29^0/15^0$

వాతావరణం
ఉదయం మంచుతోకూడిన చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై.. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి నిరంతర ప్రక్రియ..



చిల్పూరు: తెలంగాణలో అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎన్ని నిధులైనా మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. మండల పరిధి వంగాలపల్లిలో గురువారం రూ.4 లక్షలతో నిర్మించిన పీపీవీ ప్రారంభం, రూ.29 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. సర్పంచ్ అరూరి ప్రణీతప్రదీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరితబాలరాజు, నాయకులు పొట్లపల్లి శ్రీధర్ రావు, మార్కెట్ చైర్మన్ రాజు, రవి, భూక్య రమేష్ నాయక్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్



చిల్పూరు: జిల్లా కేంద్రంలో గురువారం మంత్రి దయాకర్ రావు పాల్గొనే సమావేశాలు ఉండడంతో డాగ్ స్క్వాడ్ సిబ్బంది కల్వర్టులను తనిఖీ చేస్తున్నారు. చిన్న పెండ్యాల సమీప జాతీయ రహదారిన ఎల్లమ్మ గుడి పరిసరాల్లోని కల్వర్టును చెక్ చేయడానికి సిబ్బంది సారయ్య, రాజేష్, సామ్రాట్, రవి దిగారు. అక్కడ ఎర్రరంగు బ్యాగు కలిగి ఉన్న ఓ వ్యక్తి పడుకుని ఉండగా టెన్షన్‌కు గురయ్యారు. స్థానిక ఎస్సై వినయ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చి.. ఆ వ్యక్తిని తనిఖీ చేసి బయటకు తీసుకువచ్చారు. అప్పటికే చేరుకున్న ఎస్సైకి అప్పగించగా వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించారు. మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించి కాజీపేటకు తరలించారు.

జనగామకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు



జనగామ: ఓడీఎఫ్‌తో పాటు స్వచ్ఛ సర్వేక్షణ్ (ఫాస్ట్ మూవింగ్ కేటగిరి)లో జనగామ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మున్సిపల్ కమిషనర్ రజిత గురువారం హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నారు.

వినూత్న ఆలోచన..



జనగామ రూరల్: దివంగత కవుల వివరాలతో క్యాలెండర్ ఆవిష్కరించడం వినూత్న ఆలోచన అని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడాల హరికృష్ణ అన్నారు. జిల్లా కవులు, కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రిటైర్డ్ ఆర్మీ డాక్టర్ కల్నల్ ఎం.భిక్షపతి సహకారంతో రూపొందించిన దివంగత కవుల క్యాలెండర్‌ను గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖకు అందజేశారు. కవులు కృష్ణ, సోమేశ్వరాచారి, సోమనర్సింహాచారి, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లాలోని అల్పసంఖ్యాక వర్గం వారు విదేశాల్లో పైచదువుల కోసం సీఎం విదేశీ విద్యా రుణ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా అధికారి సయ్యద్ ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, వయసు 35 ఏళ్లు మించరాదని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌తో దరఖాస్తు చేసుకుని, ఈనెల 23 సాయంత్రం 5 లోపు మూడు జతల జిరాక్స్ ప్రతులు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వివరాలకు 9963397958, 99519 33034 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేను తాగాకే మీకు..!



కల్లు మీకేనా.. నేను తాగినంక.. మిగిలిందే మీకంటూ రామచిలుక నేరుగా తాటి గొలకే మూతిపెట్టింది. ఈ దృశ్యం నర్మెట మండలం హన్మంతాపూర్‌తండా వద్ద గురువారం కనిపించింది. చిలక కొట్టిన పండే రుచిగా ఉంటే.. మరి చిలక ముట్టిన తాటి కల్లు ఎలా ఉంటుందో మరి..

– 'సాక్షి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జనగామ

6,87,393 మంది ఓటర్లు



కొత్తగా 757 నమోదు

- జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో మహిళలదే పైచేయి
- జనగామలో భారీగా పెరిగిన ఓట్లు
- మిగతా రెండుచోట్ల 879 ఓట్లు మైనస్
- తుది జాబితా ప్రకటించిన ఎలక్షన్ కమిషన్

జనగామ: రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం ఓటరు తుది జాబితాను విడుదల చేసింది. ఈ మేరకు జిల్లాలో 6,87,393 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ప్రకటించారు. గత ఏడాది నవంబర్ 9న ప్రకటించిన డ్రాఫ్ట్ పబ్లికేషన్ తర్వాత తుది జాబితాలో 879 ఓట్లు తొలగించగా.. 757 ఓట్లు కొత్తగా చేరాయి. ఇందులో పురుషులు 18, మహిళలు 729, థర్డ్ జెండర్ 10 మంది ఉన్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువ ఉండడగా.. పాలకుర్తిలో పురుష ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది.

ఓటరు నమోదు ఇలా..

గత ఏడాది నవంబర్‌లో ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ ప్రారంభించి 9వ తేదీన ప్రకటించిన డ్రాఫ్ట్ ఆధారంగా డిసెంబర్ 8 వరకు ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగింది. 16వ తేదీ వరకు అభ్యంతరాలు, ఇతరత్రా వాటికి దరఖాస్తులు స్వీకరించారు. 26వ తేదీ వరకు తుది ఓటరు జాబితాను కసరత్తు చేసిన ఎలక్షన్ కమిషన్.. గురువారం ఓటరు తుది జాబితాను విడుదల చేసింది.

మూడు నియోజకవర్గాలు..

జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. జనగామ డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో 2,19,072 ఓటర్లు ఉండగా తుది జాబితాలో 2,20,708 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 1,636 మంది ఓటర్లు పెరిగారు. ఇందులో 327 మంది మహిళలే ఉన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రకారం 2,34,755 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితాలో 2,34,229 ఓటర్లు ఉన్నాయి. 526 ఓటర్లు తగ్గారు. అయినా మహిళా ఓటర్లు 651 మంది ఎక్కువగా ఉన్నారు. పాలకుర్తిలో డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో 2,32,809 ఓట్లకు తుది జాబితాలో 2,32,456 ఓటర్లు ఉన్నారు. 353 మంది తగ్గారు. ఇక్కడ మాత్రం 730 మంది పురుష ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. డ్రాఫ్ట్ జాబితాలో థర్డ్ జెండర్ ఓటర్లు ఏడుగురు ఉండగా, తుది జాబితాలో 17కు పెరిగాయి.

ఘన్‌పూర్‌దే పైచేయి..

జనగామ, పాలకుర్తి నియోజకవర్గాలతో పోల్చితే.. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓటర్ల శాతం బాగా పెరిగింది. డ్రాఫ్ట్ పబ్లికేషన్ తర్వాత, తుది జాబితాలో 526 ఓట్లు తగ్గినా జిల్లాలో నంబర్ వన్ స్థానం నిలబెట్టుకుంది. పాలకుర్తి ద్వితీయ, జనగామ తృతీయ స్థానంలో ఉన్నాయి.

నియోజకవర్గాల వారీగా ఇచ్చాం..



ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో తుది ఓటరు జాబితాను ప్రకటించాం. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాలకు సంబంధించిన పురుషులు, మహిళలు, థర్డ్ జెండర్ ఓటర్ల వివరాలు వెల్లడించాం. కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగించిన వారి వివరాలను సైతం నియోజకర్గాల వారీగా ఇచ్చాం.

– సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్, జనగామ

జిల్లాలో తుది ఓటరు జాబితా వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం	పెరిగిన ఓట్లు
జనగామ	1,10,185	1,10,512	11	2,20,708	1,636
స్టే.ఘన్‌పూర్	1,16,788	1,17,439	02	2,34,229	(–)526
పాలకుర్తి	1,16,591	1,15,861	04	2,32,456	(–)353
మొత్తం	3,43,564	3,43,812	17	6,87,393	757

'బడి' పనులు పకడ్బందీగా చేపట్టాలి

- రాష్ట్ర వయోజన విద్య అడిషనల్ డైరెక్టర్ ఎస్ఎస్.విజయలక్ష్మి



నేలపోగుల స్కూల్‌లో పరిశీలిస్తున్న విజయలక్ష్మి

జనగామ రూరల్: ప్రభుత్వం 'మనఊరు–మన బడి' కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర వయోజన విద్య అడిషనల్ డైరెక్టర్ ఎస్ఎస్.విజయలక్ష్మి అన్నారు. గురువారం జిల్లాలోని పలు పాఠశాలలను ఆమె పరిశీలించారు. జనగామ మండలం పసరమడ్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆమె అక్కడ చేపట్టిన పనుల వివరాలు తెలుసుకున్నారు. అలాగే స్కూల్‌లో 'తెలిమెట్టు' అమలు తీరుపై విద్యార్థుల అభ్యసన, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. బోధన సామగ్రి తరగతి గదిలో ఏవిధంగా వినియోగిస్తున్నారు.. పాఠ్య ప్రణాళిక ప్రకారం బోధన చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కృత్యమేళాలో జిల్లా స్థాయికి ఎంపికైన సురేందర్‌రెడ్డి, మాధవిని అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ కె.రాము, క్వాలిటీ కంట్రోల్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్, మెరుగు రామరాజు, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలపోగుల పాఠశాలలో..

లింగాలఘణపురం: మండల పరిధి నేలపోగుల ప్రాథమికోన్నత పాఠశాలను రాష్ట్ర వయోజన విద్య అడిషనల్ డైరెక్టర్ విజయలక్ష్మి సందర్శించారు. ఆమె వెంట డీఈఓ రాము, నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలి

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్: ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సాగు లక్ష్యం 6,064 ఎకరాలు కాగా ఇప్పటికే 351 మంది రైతులు పంట వేస్తున్నారని, ఈవారంలో నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయడానికి రైతులు డీడీలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సందేహాలుంటే నివృత్తి చేయాలని సూచించారు. బిందు సేద్యం పరికరాల కంపెనీ ప్రతినిధులు హార్టికల్చర్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఉద్యానవ అధికారి లత, ఆయిల్ ఫెడ్ ఇన్‌చార్జ్ రామకృష్ణ, వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, ఏడీఏ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

- కమిషన్ రాష్ట్ర సభ్యురాలు శోభారాణి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శోభారాణి

జనగామ: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నైతిక బాధ్యతగా తీసుకోవాలని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యురాలు శోభారాణి అన్నారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో బాలల రక్షణ కమిటీలకు గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సర్పంచులు, ఎంపీటీసీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధికారి జయంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో శోభారాణితో పాటు బృందాదర్ మాట్లాడారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను రూపు మాపేందుకు ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలని కోరారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పించేందుకు శాఖాపరంగా అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. 'విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీస్ రోల్స్ అండ్ రెస్పాన్సిబులిటీస్, బాలల హక్కులు' అనే అంశంపై బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. బాలల పరిరక్షణ కమిటీలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈఓ రాము, జనగామ ఆర్డీఓ మధుమోహన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఉప్పలయ్య, సభ్యులు కవిత, శ్రీలత, సీడీపీఓ వసంత, డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఏసీపీ దేవేందర్, లేబర్ ఆఫీసర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

తీగ లాగితే కదిలిన డొంక!

- చిన్న 'క్లూ'తో హత్య కుట్ర.. కూపీ లాగిన పోలీసులు
- కలకలం రేపిన 'సాక్షి'కథనం..
- పోలీస్‌ల అదుపులోనే ఏఆర్ఎస్ఐ గ్యాంగ్!
- రంగంలోకి రాష్ట్ర నిఘా వర్గాలు
- ఆయుధాలపై పోలీస్ అధికారుల ఆరా
- నేడో రేపో రిమాండ్‌కు అవకాశం

సాక్షిప్రతినిధి, వరంగల్: ములుగు జిల్లా కేంద్రంగా ఏఆర్ఎస్ఐ పన్నిన కుట్ర కోణం బహిర్గతంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. హెడ్‌కానిస్టేబుల్ హత్యకు స్కెచ్.. ఆ తర్వాత పరిణామాలకు వ్యూహకర్తయిన ఏఆర్ ఎస్ఐ.. సహచరులతో షేర్ చేసుకున్నట్లు సమాచారం. ఆ నోట ఈ నోట పడిన ఈ కుట్రకోణం పది రోజుల కిందటే లీకైనా.. తాగిన మత్తులో వాగినట్లుగా పోలీసులు మొదట లైట్‌గా తీసుకున్నట్లు సమాచారం. చివరకు రాష్ట్ర నిఘావర్గాలు రంగంలోకి దిగి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. దాని ఆధారంగా 'తీగ లాగితే డొంక కదిలినట్లు'గా 'డబుల్ గేమ్'కుట్ర బయటపడినట్లు తెలిసింది. ఇదే కోణంలో విచారణను ముమ్మరం చేసిన నిఘావర్గాలు స్థానిక పోలీస్‌లతో కలిసి ఏఆర్ ఎస్ఐతోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని ఆరా తీయగా అసలు విషయం బయటపడినట్లు సమాచారం. ఈ కుట్ర కోణం బట్టబయలుపై 'సాక్షి' వెలువరించిన కథనం చర్చనీయాంశంగా మారింది.

అన్ని కోణాల్లో విచారణ..

ఓ ఏఆర్ ఎస్ఐ తన శాఖలోని ఓ హెడ్‌కానిస్టేబుల్ హత్యకు పన్నిన కుట్ర బట్టబయలు కావడం సర్వత్రా కలకలం రేపుతోంది. మావోయిస్ట్ తరహాలో నకిలీ సాయుధ దళం ఏర్పాటు చేసి వరంగల్‌లో హెడ్ కానిస్టేబుల్‌ను కాల్చి చంపి, ఆ తర్వాత అందులో పాల్గొన్న వారి అడ్డు తొలగించుకునే కుట్ర ప్రచారం చర్చనీయాంశమైంది. ఇదే అంశం సోషల్ మీడియా సర్కిళ్లలో చక్కర్లు కొట్టగా.. ఇదే సమయంలో అందుకు కారకులైన వారిని అదుపులోకి తీసుకోవడం సంచలనం కలిగించింది. కేంద్ర, రాష్ట్ర నిఘావర్గాలు రంగంలోకి దిగినట్లు ప్రచారం. ఇదే సమయంలో కుట్రకోణం లీక్‌పై ఆరా తీస్తున్నారు. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ నేపథ్యంలో రెండు ఆయుధాలను స్వాధీనం చేసుకునట్లు సమాచారం. లోతైన విచారణ సాగిస్తున్న పోలీసులు నోరు విప్పేందుకు నిరాకరిస్తున్నారు.

నేడో రేపో రిమాండ్‌కు ఏఆర్ఎస్ఐ గ్యాంగ్..

ఈ కుట్రకోణానికి సూత్రధారి అయిన ఏఆర్ ఎస్ఐ ముందు నుంచీ వివాదాస్పదుడే. భూపాలపల్లి జిల్లాకు చెందిన అతను 1995లో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరి ఏఆర్ ఎస్ఐ స్థాయికి చేరాడు. మావోయిస్టుల సాయుధ పోరాటం, పోలీస్ డిపార్ట్‌మెంట్ గురించి స్పష్టంగా తెలియడంతో పక్కా వ్యూహంతో కుట్ర పన్నినప్పటికీ పోలీసులు వినియోగించిన సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డంగా దొరికినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బృందం అదుపులో ఉన్న ఏఆర్ఎస్ఐతో పాటు ఇద్దరు మాజీలకు ఇంకా ఎవరితో సంబంధాలు ఉన్నాయి? ఆయుధాలు ఎలాసమకూర్చుకున్నారు? కుట్ర వెనుక ఇంకా ఎత్తుగడలున్నాయా? అనే కోణంలో విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణ పూర్తి చేసి నేడో, రేపో వివరాలు వెల్లడించి ఈ గ్యాంగ్‌ను రిమాండ్‌కు తరలించే అవకాశం ఉందని సమాచారం.

'కంటి వెలుగు' లక్ష్యం నెరవేర్చాలి

- 100 రోజుల్లో 6 లక్షల మందికి కంటి పరీక్షలు
- శిబిరం ఉన్న రోజు గ్రామాల్లో ఉపాధి పనులకు సెలవు ఇవ్వాలి
- ఉమ్మడి జిల్లాలో ఉచిత ఆపరేషన్లకు కృషి
- సమీక్షలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన కలెక్టర్, జెడ్పీ చైర్మన్

జనగామ: అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం లక్ష్యం నెరవేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ పథకం గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకోబోతున్నదని చెప్పారు. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే 'కంటి వెలుగు–2' కోసం గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్నద్ధత సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. 'కంటి వెలుగు' మొదటి విడత కార్యక్రమంలో జిల్లాలో 4 లక్షల మందికి పరీక్షలు చేయగా.. ప్రస్తుతం రెండో విడత కార్యక్రమంలో 6 లక్షలు టార్గెట్ పెట్టుకుని 100 రోజుల్లో పూర్తి చేయడానికి ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. 281 జీపీలు, మున్సిపాలిటీ పరిధి 30 వార్డులు కలుపుకుని 26 బృందాల పర్యవేక్షణలో ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తారని, జిల్లాకు 7వేల రీడింగ్ అద్దాలు వచ్చాయని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ఉచితంగా కంటి పరీక్షలు చేయించి.. అవసరమైన అద్దాలు అందజేసి, ఆపరేషన్లు చేయిస్తున్నారని, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, రైతు సమన్వయ సమితి, వార్డు సభ్యులు, ఇలా ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని అన్నారు. కంటి వెలుగు విజయవంతానికి మండల కేంద్రాల్లో శుక్రవారం(నేటి) నుంచి ఎంపీపీ కోఆర్డినేషన్‌తో సమావేశాలు నిర్వహించి.. గ్రామాల వారీగా వైద్య శిబిరాలు ఏరోజు.. ఎక్కడ నిర్వహిస్తారనే విషయంపై నిర్ణయం తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో సర్పంచ్, వార్డు మెంబర్, వైద్య సిబ్బంది, తదితరులు ఇంటింటికీ వెళ్లి ప్రజలు కంటి పరీక్షలు చేయించుకునేలా చూడాలని చెప్పారు. ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సమయానుకూలంగా కంటి వైద్య శిబిరాలను ప్రారంభించాలని, ఎవరో వస్తారని ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన రోజు ఆయా గ్రామంలో ఉపాధి పనులకు సెలవు ప్రకటించాలని ఆదేశించారు. పరీక్షల అనంతరం అద్దాలు అవసరమయ్యే వారికి 15 రోజుల్లో ఇంటికి వచ్చి అందజేస్తారని, ఉమ్మడి జిల్లాలో ఉచిత ఆపరేషన్లకు కృషి చేస్తానని మంత్రి పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మోడల్ కంటి పరీక్షల కేంద్రాన్ని పరిశీలించిన మంత్రికి కంటి పరీక్షలు నిర్వహించి రీడింగ్ అద్దాలు అందజేశారు. సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే టి.రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, డీసీపీ సీతారాం, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎ.మహేందర్, డీఆర్డీఓ రాంరెడ్డి, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నిమ్మతి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుమిత్రలను ఆదుకోవాలి

జనగామ రూరల్: పశువైద్య శాఖలో సేవలందిస్తున్న పశుమిత్రలను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాపర్తి రాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గడిచిన ఎనిమిదేళ్లుగా మూగ జీవాలకు రోగాలు రాకుండా టీకాలు, నట్టల నివారణ మందులు, వ్యాధుల నివారణకు ఉచిత సేవలు అందిస్తున్న పశుమిత్రలకు ఇప్పటి వరకు కనీస వేతనం అమలు చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే వారిని ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా రాపర్తి రాజు, అధ్యక్షురాలిగా ఎండీ.నజియాబేగం, ప్రధాన కార్యదర్శిగా బి.మంగ, ఉపాధ్యక్షురాలిగా సంధ్య మనీలా, సహాయ కార్యదర్శులుగా శ్రావణి, అనిత, కోశాధికారిగా సరళతో పాటు 22 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

నలుగురికి శ్రామిక రత్న అవార్డు



అవార్డులు అందుకున్న కార్మిక నాయకులు

రఘునాథపల్లి: జిల్లాలోని నలుగురు భవన నిర్మాణ రంగ కార్మికులను శ్రామిక రత్న అవార్డులు వరించాయి. మహాజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ సుందరయ్య భవన్‌లో గురువారం అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర భవన నిర్మాణ రంగాల ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య మాట్లాడుతూ తోటి కార్మికులకు అండగా ఉంటూ శ్రమిస్తున్న నలుగురికి అవార్డులు రావడం గర్వంగా ఉందన్నారు. అవార్డులు అందుకున్న వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు వాతల యాదగిరి, కార్యదర్శి గొడిశాల ఐలేష్, కోశాధికారి తూడి అంజయ్య, ప్రచార కార్యదర్శి పసుల వెంకటస్వామి ఉన్నారు.

'రైతుబంధు' ఇప్పించండి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

- మంత్రి ఎర్రబెల్లి ఎదుట రైతుల మొర

లింగాలఘణపురం: 'రైతుబంధు' సాయం ఆగిపోయింది.. ఇప్పించాలని కోరుతూ మండల పరిధి నాగారం గ్రామానికి చెందిన సుమారు 70 మంది రైతులు గురువారం కలెక్టరేట్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కోరారు. రైతులంతా సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకోవడానికి వెళ్లగా సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే రాజయ్య కనిపించడంతో తమ గోడును వారికి వినిపించారు. '60 ఏళ్ల క్రితం మా తాతలు, తండ్రులు నాగారం గ్రామానికి చెందిన దుంబాల లవకుమార్‌రెడ్డి, శత్రుఘ్నరెడ్డి, సుకేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, రాజఅంగదరెడ్డి వద్ద భూమి కొనుగోలు చేశారు. పట్టాదారు పాసుపుస్తకాలు కూడా పొందాము. ఇప్పుడు భూములపై కోర్టులో కేసులు వేసి ప్రొహిబిటెడ్‌లో పెట్టారు' అని వాపోయారు. ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తమ భూములను తొలగించి న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మార్పు శ్రీనివాసురెడ్డి, డాక్టర్ లవకుమార్‌రెడ్డి, గొరిగె మదార్, కృష్ణ, ఎల్లగౌడ్, యాదగిరి, అంజనేయులు, అనిల్, నాగరాజు, సుదర్శన్, శ్రీశైలం, మధు తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్‌తోనే అణగారిన వర్గాలకు న్యాయం

- రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు నరేష్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మార్పీఎస్‌తోనే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ అన్నారు. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్ల ఫలాలు అన్ని కులాలకు జనాభా ప్రాతిపదికన అందాలని, ఇందుకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుత సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. ఎస్సీల వర్గీకరణ సాధన ఉద్యమ నిర్మాణంలో యువకులు, విద్యావంతులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 11న బెంగళూరులో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభలకు తరలిరావాలని కోరారు. ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, నాయకులు కొయ్యడ మల్లేష్, జిల్లా ఇన్‌చార్జ్ ఇనుముల నర్సయ్య, పైస రాజశేఖర్, అనీల్, సోమశేఖర్, చాడ ఏలియా, గాదె శ్రీధర్, నాగరాజు, ఇసాక్, శ్రీనివాస్, హరికృష్ణ, శ్రావణ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చాక రూ.500లకే వంట గ్యాస్

- కాంగ్రెస్ మహిళా నాయకులు



పెరిగిన నిత్యావసరాల ధరల పట్టికను చూపుతున్న దుర్గారాణి, ఇందిరా తదితరులు

జనగామ రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రూ.500లకే వంట గ్యాస్ అందిస్తామని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బండి కె ఇందిర, జిల్లా ఇన్‌చార్జ్ దుర్గారాణి అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసరాల ధరలు పెంచుతూ సామాన్యులను రోడ్డున పడేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రూ.450లకే వంట గ్యాస్ ఇవ్వగా.. నేడు బీజేపీ ప్రభుత్వం రూ.1,150కి తీసుకొచ్చిందని అన్నారు. దేశ సంపదను అంబానీ అదానీలకు దోచి పెడుతోందని ధ్వజమెత్తారు. ఇక రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని, పేదలు బతలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్ పార్టీ వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వంగాల కళ్యాణి, రాముని జయ, పేర్ని ఉష, విమల, వందన, పద్మ, రజనీ, కృష్ణవేణి, అనిత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపునకు సర్వే

- నేటి నుంచి 18 వరకు వివరాల సేకరణ
- ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు
- తెలంగాణ సమగ్ర శిక్ష నుంచి ఆదేశాలు

విద్యారణ్యపురి: పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం(నేటి) నుంచి ఈ నెల 18 వరకు బడి బయట ఉన్న పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించాలని పాఠశాల విద్యా డైరెక్టర్, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవసేన ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉమ్మడి వరంగల్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సర్వేలో భాగంగా 6 నుంచి 14 ఏళ్లు, 15 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న బడి బయటి బాలలను, ఇప్పటి వరకు బడిలో నమోదు కాని పిల్లల వివరాలను గుర్తించడానికి ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. సర్వే ప్రధాన లక్ష్యం బడికి రాని పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం. దీనిని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షిస్తారు. అలాగే, గుర్తించిన వారి వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. 2023–24 విద్యా సంవత్సరంలో విద్యా ప్రణాళిక తయారు చేయడానికి ఈ సర్వే ఉపయోగపడనుంది.

అందరికీ భాగస్వామ్యం..

ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ సర్వేలో పాల్గొనాలి. అంగన్‌వాడీ టీచర్ల సాయం కూడా తీసుకోవచ్చు. స్వచ్ఛంద సంస్థలు, బాలల హక్కుల సంఘాలు, విద్యాభిమానులు సర్వేలో పాల్గొని బడి బయటి పిల్లలను గుర్తించవచ్చు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు మాత్రం సర్వేను నిరంతరం పర్యవేక్షించాలి. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సర్వేలో కీలకపాత్ర పోషిస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల నమోదుకు సంబంధించిన సర్వేను ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ చేస్తారు. ఈ సర్వే కోసం 49 కాలములు కలిగిన మూడు రకాల ప్రొఫార్మాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేశారు. అందులో 6 నుంచి 14 ఏళ్ల వయస్సు పిల్లల కోసం ఒక ప్రొఫార్మా, 15 నుంచి 19 ఏళ్ల బడి బయటి విద్యార్థుల గుర్తింపునకు మరో ప్రొఫార్మా, ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని గుర్తించడానికి మరో రకమైన ప్రొఫార్మా రూపొందించారు. సీఆర్పీలు – ఐఈఆర్పీలు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తమ ఆవాసంలోని ప్రతి గృహాన్ని సందర్శించి ఈ సర్వే చేయాల్సిఉంటుంది. అలాగే, వివరాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేయాలి.



పకడ్బందీగా సర్వే



హనుమకొండ జిల్లాలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తాం. సీఆర్పీలకు సాయంగా ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీలు పాల్గొనాలి. మండల విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తూ సర్వే తర్వాత ఒక విద్యార్థి కూడా బడి బయట ఉండకుండా చూసుకోవాలి. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పిల్లలను కూడా గుర్తించి వారిని దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించాలి. బాలికలు అయితే కేజీబీవీల్లో అడ్మిషన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మహ్మద్ అబ్దుల్ హై, జిల్లా విద్యాశాఖ అధికారి, హనుమకొండ

షెడ్యూల్ ప్రకారం జరిగేలా చర్యలు



సర్వే ఎలా చేయాలో ఇప్పటికే ఒక రోజు శిక్షణ ఇచ్చాం. గురువారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి సర్వేకు అవసరమైన విషయాలు తెలియజేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 18 వరకు సర్వే నిర్వహించి, 19 నుంచి 25వ తేదీ వరకు పిల్లల వివరాలను ప్రబంధు పోర్టల్‌లో నమోదు చేయాలి. 30న పూర్తి వివరాలను జిల్లా విద్యాశాఖకు అందించాలి. 31న డీఈఓ బడి బయట విద్యార్థుల వివరాలను స్టేట్ ప్రాజెక్ట్ అధికారికి అందిస్తారు.

– శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ ఓఎస్సీ కోఆర్డినేటర్

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

నల్లబెల్లి: బాలింత పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నార్లాపురం రాజారాం తెలిపారు. వరంగల్ జిల్లా నల బెల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన ఓ బాలింత తన 3 నెలల కుమార్తెకు చనుపాలు ఇస్తుంది. ఈ క్రమంలో ఇంటి సమీపంలోని మూడు రాజుకుమార్ బాలింత పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఫోన్‌లో ఫొటోలు తీశాడు. విషయాన్ని గమనించిన ఆమె అడ్డుకుని కుటుంబ సభ్యులకు తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ఖానాపురం: కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఘటన వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బద్రుతండాలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లలిత అనే మహిళ ఇంట్లో రెండు రోజులుగా కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సైబర్ వలలో ఇద్దరు

- రూ.66వేలు పోగొట్టుకున్న బాధితులు

కాజీపేట: సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి ఇద్దరు వ్యక్తులు రూ.66వేలు పోగొట్టుకున్నట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి తెలిపారు. పీఎస్‌లో గురువారం రాత్రి వివరాలు వెల్లడించారు. సిద్ధార్థనగర్ కాలనీకి చెందిన వ్యక్తి రెండేళ్ల క్రితం మేక్ మై ట్రిప్ యాప్‌లో ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుని డబ్బు చెల్లించాడు. కరోనా తీవ్రత నేపథ్యంలో టికెట్ క్యాన్సిల్ చేసుకోగా డబ్బు రిటర్న్ రాలేదు. దీంతో ఇటీవల గూగుల్‌లో నంబర్ చూసి కాల్ సెంటర్‌కు ఫోన్ చేయగా సరైన సమాధానం రాలేదు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి డబ్బు వాపస్ రావాలంటే ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. నిజమేనని నమ్మిన సదరు వ్యక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోగానే బ్యాంకు ఖాతా నుంచి రూ.20వేలు డెబిట్ అయ్యాయి. అలాగే, జూబ్లీ మార్కెట్‌కు చెందిన మరో వ్యక్తి సెకండ్ హ్యాండ్ కారు కోసం ఫేస్‌బుక్‌లో చూసి ఫోన్ చేయగా అవతలి వ్యక్తి అడ్వాన్స్ పంపించాలని నమ్మించాడు. కారు చౌకగా లభిస్తుందని నమ్మి రూ.46వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ వచ్చింది. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మరిపెడ రూరల్/కురవి: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బీచ్‌రాజ్‌పల్లి పరిధి జర్పులతండా, కురవి మండలం నేరడ శివారు బాల్యతండాలో రైతులు సాగు చేసిన మిరప తోటలను బెంగళూరు, హైదరాబాద్ నుంచి వచ్చిన జాతీయ శాస్త్రవేత్తల బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా తామర పురుగు, నల్లి తదితర సమస్యలను రైతులు శాస్త్రవేత్తలకు వివరించారు. మోతాదుకు మించి పురుగు మందుల పిచికారీ, సామూహికంగా కాకుండా ఒకరి తర్వాత మరొకరు మందులు పిచికారీ చేయడంతో తెగుళ్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మిర్చి తోటలో 15 రోజులకోసారి వేపనూనె పిచికారీ చేసి నీలి, పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలన్నారు. వేప గింజల కషాయం, వేప పిండి, వేప నూనె, కానుగ నూనె ఐదు మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఎంబీపీఐఆర్ బెంగళూరు ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త శ్రీదేవి మాట్లాడుతూ జీవ శిలీంద్ర నాశకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కలిపి వాడినట్లయితే తామర పురుగు, నల్లిని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐఐహెచ్‌ఆర్ బెంగళూరు నుంచి రవణప్ప, ఎంబీపీఐఆర్ బెంగళూరు నుంచి రచన, మిథున్, హైదరాబాద్ డీడీహెచ్ వేణుగోపాల్‌రెడ్డి, ఉద్యాన అధికారి మహేష్, మల్యాల కేవీకే శాస్త్రవేత్త మాలతి, మల్యాల హెచ్‌ఆర్‌ఎస్ భాస్కర్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి సూర్యనారాయణ, మరిపెడ ఏడీఏ శోభన్‌బాబు, ఏఓ వీరసింగ్, డోర్నకల్ డివిజన్ ఉద్యాన అధికారి అనితశ్రీ, రైతులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: జర్పులతండాలో మిర్చి తోటను పరిశీలిస్తున్న జాతీయ శాస్త్రవేత్తల బృందం

క్రీడా పోటీలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఏసీపీ రఘుచందర్



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

- ఏసీపీ డి.రఘుచందర్
- ఘన్‌పూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం పెరుగుతుందని ఘన్‌పూర్ ఏసీపీ డి.రఘుచందర్ అన్నారు. ఘన్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా వివిధ కళాశాలల నుంచి 350 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడారు. ఉమ్మడి జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్‌మీట్‌ను ఘన్‌పూర్‌లో నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇలాంటి క్రీడాపోటీల ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యం, ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన వారికి ఉన్నత చదువుల్లో, ఉద్యోగ అవకాశాల్లో స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్లు ఉంటాయన్నారు. గెలుపోటములు సహజమని, అందరూ క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని సూచించారు. ఘన్‌పూర్ సీఐ ఎ.రాఘవేందర్, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ప్రభాకర్, ఘన్‌పూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇన్‌చార్జ్ పీడీ ఎం.రాజ్‌కుమార్, రామక్రిష్ణ, ఏఓ మనోహర్‌రావు, పీఈటీలు వాసుదేవరావు, మనోజ్‌కుమార్, కొండ రవి, వంచ చంద్రశేఖరరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, గోపాలకృష్ణ, వేణు, సుధాకర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్.. గౌరవం లేదు

- పదేపదే అవమానిస్తున్నారు
- భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీహర్షిణి ఆవేదన



మాట్లాడుతున్న శ్రీహర్షిణి

భూపాలపల్లి అర్బన్: జిల్లా స్థాయి అధికారిక సమావేశాలకు సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించడం లేదని, సమాచారం ఇచ్చినా సమావేశంలో గౌరవం ఇవ్వడం లేదని భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లంద్ క్లబ్‌హౌస్‌లో కంటి వెలుగు కార్యక్రమంపై మంత్రి సత్యవతిరాథోడ్ గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ భవేష్‌మిశ్రా తనకు గౌరవం ఇవ్వకుండా అవమానపరిచారని, సభా వేదికపై పక్కకు నెట్టినట్లు ఆరోపించారు. జిల్లాలో జరిగే అధికారిక కార్యక్రమాలకు ప్రొటోకాల్ పాటించడం లేదని, కలెక్టర్‌తో పాటు కింది స్థాయి అధికార యంత్రాంగం కూడా పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రొటోకాల్ విషయమై గతంలోనే మాట్లాడాలనుకున్నాని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పటికీ గౌరవం దక్కకపోవడం ఒక మహిళగా బాధ కలుగుతుందన్నారు. సమావేశాలు, కార్యక్రమాల్లో విలువ ఇవ్వకుండా, ప్రొటోకాల్ పాటించనప్పుడు ఎందుకు పిలుస్తున్నారని ప్రశ్నించారు. ఇదే చివరి అవకాశమని, మరోసారి అవమానం జరిగితే పైఅధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు.

కూలి పనికి వెళ్లి కానరాని లోకాలకు..

- వ్యవసాయ బావిలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
- రైతు ఇంటి వద్ద మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



ప్రభాకర్ (ఫైల్)

నెక్కొండ: కూలి పని కోసం వెళ్లిన వ్యక్తి వ్యవసాయ బావిలో శవమై తేలిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం తోపనపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలంకానిపేట గ్రామానికి చెందిన గీత కార్మికుడు వడ్లకొండ ప్రభాకర్(43) అన్ సీజన్‌లో కూలి పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో తోపనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బల్ల వెంకన్న వ్యవసాయ బావి వద్ద పని ఉందని ఫోన్ చేసి ప్రభాకర్‌ను పిలిచాడు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో విద్యుత్ మోటార్‌ను తీసే క్రమంలో విద్యుత్ షాక్‌తో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని వెంకన్న బాధిత కుటుంబ సభ్యులకు తెలిపాడు. అనంతరం గ్రామస్తుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా, ప్రభాకర్ మృతిపై అనుమానాలు ఉన్నాయని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. గ్రామస్తులతో కలిసి మృతదేహంతో వెంకన్న ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. న్యాయం చేయాలని, మృతికి కారణమైన వెంకన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. నెక్కొండ సీఐ హత్తిరాం ఇరువర్గాలను శాంతింపజేసి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని నర్సంపేట ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య రజిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



మృతదేహంతో వెంకన్న ఇంటి వద్ద ఆందోళన

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చెన్నారావుపేట: గెట్టు తగాదాలో రైతు పెద్ద రాజును హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నెక్కొండ ఇన్‌స్పెక్టర్ హతిరాం, చెన్నారావుపేట ఎస్సై తోట మహేందర్‌లు తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన జంగిలి పెద్ద రాజుకు దాసరి మార్కెండేయకు గెట్టు విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం మార్కెండేయకు పెద్ద రాజుకు మరోసారి గొడవ జరిగింది. దీంతో పెద్ద రాజును మట్టుపెడితేనే భూసమస్య తీరుతుందని భావించిన మార్కండేయ పొలానికి నీరు పారిస్తున్న సమయంలో పారతో కొట్టి చంపాడు. అనంతరం పక్కనే ఉన్న బావిలో పడేసి కాలు జారి పడిపోయినట్లు చిత్రీకరించడానికి యత్నించాడు. ఆ తర్వాత పారిపోయాడు. విచారణ అనంతరం నర్సంపేట ఏసీపీ సంపత్‌రావు ఆదేశాల మేరకు నిందితుడి పట్టుకుని కోర్టులో హాజరుపరిచి ఖమ్మం జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్, ఎస్సై తెలిపారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మచ్చాపూర్ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన పేలుడు పదార్థాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన తౌటం ధనుంజయ, చార్‌బౌళిలోని శ్రీ మాతా ఎంటర్‌ప్రైజెస్ యజమాని వంగరి వేణుగోపాల్ ఎలాంటి అనుమతులు లేకుండా 240 జిలెటిన్ స్టిక్స్, ఎనిమిది వైర్ బండిల్స్, ఏడు కార్డ్ వైర్ బండిల్స్, బ్యాటరీలను విక్రయించడానికి నిల్వ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.వెంకటేశ్వర్లు, వి.నరేశ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేసి పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ మృతదేహం

కొడకండ్ల: జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన వావిలాల వెంకటేష్(30) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. వివరాలిలా ఉన్నాయి. గంట్లకుంట గ్రామానికి చెందిన స్రవంతితో ఎనమిదేళ్ల క్రితం వెంకటేష్ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్ హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ ఐదేళ్లు బాగానే ఉన్నాడు. ఆ తర్వాత మద్యానికి బానిస కావడంతో కంపెనీ వారు ఉద్యోగం నుంచి తొలగించారు. భార్య, తండ్రి ఎంత చెప్పినా వినకుండా తరుచూ వారితో గొడవపడుతూ కొడుతుండేవాడు. ఏ పనిచేయకపోవడంతో కొడకండ్లకు వచ్చి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం భార్యను కొడుతుండటంతో తండ్రి సుదర్శన్ వారించే ప్రయత్నం చేయగా అతడిని సైతం కొట్టాడు. దీంతో స్రవంతి పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. తండ్రి తన కుమార్తె ఇంటికెళ్లాడు. ఎవరూ లేని సమయంలో రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇరుగుపొరుగు వారు గురువారం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురెల్లి తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘన.. వ్యక్తికి జరిమానా

ఖానాపురం: బైండోవర్ ఉల్లఘించిన వ్యక్తికి జరిమానా విధించినట్లు నర్సంపేట ఎక్సైజ్ సీఐ రాజసమ్మయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బోటిమీదితండాకు చెందిన భూక్య రమేష్ గుడుంబా రవాణా చేస్తూ గత ఏడాది జూన్ 26న పట్టుబడ్డాడు. దీంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కాగా, అదే వ్యక్తి మరోసారి డిసెంబర్ 28న గుడుంబా రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. మరోసారి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా నిబంధనలు ఉల్లంఘిచడంతో రూ.1లక్ష జరిమానా విధించారు. ఎస్సై రాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి అస్వస్థతపై విచారణ

శాయంపేట : ఎంజేపీ విద్యార్థి అస్వస్థతపై డీసీఓ సరిత విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మారపాక కుమార్ కుమారుడు హరికృష్ణకు మంగపేట ఎంజేబీపీలో సీటు వచ్చింది. మంగపేట గురుకుల పాఠశాలలో సరైన వసతులు లేకపోవడంతో 240 మంది విద్యార్థులను శాయంపేట ఎంజేపీకి తరలించారు. కాగా, డిసెంబర్ 7న హరికృష్ణ అనారోగ్యం బారిన పడ్డాడు. విషయాన్ని హెల్త్ సూపర్‌వైజర్‌కు చెప్పినా పట్టించుకోలేదు. విద్యార్థి ఆరోగ్యం మరింత క్షీణించడంతో తోటి విద్యార్థులు విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. అతడు విద్యార్థి తండ్రికి సమాచారం ఇవ్వాలని సూచించడంతో హెల్త్‌సూపర్‌వైజర్ డిసెంబర్ 8న ఫోన్‌లో విషయం చెప్పింది. దీంతో విద్యార్థి తండ్రి పాఠశాలకు చేరుకుని హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాడు. అయితే, అనారోగ్యం గురించి హెల్త్ సూపర్‌వైజర్‌కు చెబితే ఇంటికి వెళ్లడానికి సాకులు చెబుతున్నావని కొట్టి పంపించిందని, మరుసటి రోజు ఆరోగ్యం పూర్తిగా క్షీణించాక తోటి పిల్లలు తన కుమారుడిని మోసుకెళ్లి ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో తనకు సమాచారం ఇచ్చారని విద్యార్థి తండ్రి పేర్కొన్నారు. ఈ విషయమై ఆర్సీఓకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా, విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం డీసీఓ సరిత గురుకుల పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టి నివేదికను ఆర్సీఓకు సమర్పించినట్లు సమాచారం. ఈ విషయం బయటకు రాకుండా గురుకుల ఉపాధ్యాయ, సిబ్బంది జాగ్రత్త వహించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఏడో తరగతి చదువుతున్న హరికృష్ణ అనారోగ్యం బారిన పడడంతో హెల్త్ సూపర్‌వైజర్ విద్యార్థి తండ్రికి సమాచారం అందించిందని తెలిపారు. విద్యార్థిపై ఆమె చేయి చేసుకున్నది అవాస్తవమని తెలిపారు.

నివేదిక ఆధారంగా చర్యలు

విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు డీసీఓతో గురుకుల పాఠశాలలో విచారణ చేయించాం. ఆమె నివేదిక సమర్పించగానే పాఠశాల సిబ్బంది తప్పిదం ఉన్నట్లు తేలితే బాధ్యులకు మెమోలు జారీ చేస్తాం. ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా తదుపరి చర్యలు తీసుకుంటాం.

– రాంరెడ్డి, ఆర్సీఓ